అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

ఆదివారం 31, మే 2026 | సంపుటి :03 | సంచిక :112 | పేజీలు :05 | వెల ₹5


## గీసుగొండలో అంతర జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- ఇద్దరు నిందితుల నుండి రూ. 35 వేల సొత్తు, బైక్ స్వాధీనం: సీఐ విశ్వేశ్వర్

05



## పరకాల మున్సిపల్ నూతన కమిషనర్‌గా గ్రూప్-1 అధికారి పోతరాజు పవన్

- అసిఫాబాద్‌కు అంజయ్య బదిలీ..
- 'అక్షర దర్బార్' కథనానికి స్పందన

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా గ్రూప్–1 అధికారి పోతరాజు పవన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన అంజయ్య దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో గత కొన్ని రోజులుగా కమిషనర్ లేకపోవడంతో మున్సిపాలిటీలో పలు పరిపాలనా పనులు పెండింగ్‌లో ఉండిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పరకాలకు కొత్త కమిషనర్‌ను నియమించనున్నట్లు 'అక్షరదర్బార్' పత్రిక కథనం వెలువడగా, శనివారం పోతరాజు పవన్ కమిషనర్‌గా నియమించడం జరిగింది. అంజయ్య అసిఫాబాద్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

# 2034 వరకు నేనే ఇక్కడ



- కేసీఆర్ పై ఒట్టు వేసి హరీష్ నిజం చెప్పాలి
- సీబీఐకి రెండు కేసులు ఇచ్చాం.. కిషన్ రెడ్డి ఎందుకు నోరు విప్పరు?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయని జోస్యం

02

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీల అంతర్గత స్నేహాన్ని ఎండగడుతూనే, మాజీ మంత్రి హరీష్ రావు గురిచేసి విమర్శనాస్త్రాలు సంధించారు. రాబోయే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని జోస్యం చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు, సీబీఐ కేసులు, కాంగ్రెస్ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు పార్టీ మారుతున్నారనే ప్రచారంపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "హరీష్ రావు తెరవెనుక ఎవరెవరితో మాట్లాడుతున్నారో, ఏ ఏ శక్తులతో సంప్రదింపులు జరుపుతున్నారో పూర్తి సమాచారం నా దగ్గర ఉంది. ఆయనకు బీఆర్ఎస్ పార్టీపై అంత నిబద్ధత ఉంటే... తాను బీఆర్ఎస్ లోనే ఉంటానని కేసీఆర్ పై ఒట్టు వేసి చెప్పాలి. ఆ ధైర్యం హరీష్ రావుకు ఉందా?" అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

– అక్షరదర్బార్, హైదరాబాద్

## నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు

- టీక్యా తండాలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- రైతులను ముంచుతున్న మామ, అల్లుడు.. కేసు నమోదు
- రంగంలోకి దిగిన తొర్రూర్ పోలీసులు, సీసీఎస్ బృందం
- -భారీగా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

03




# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- జిల్లాల వారీగా ముఖ్య అతిథుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- అమరవీరులకు నివాళులు అర్పించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన అధికారిక కార్యక్రమం
- జిల్లాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్న మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, సలహాదారులు
- హనుమకొండకు పొంగులేటి, వరంగల్ కు సురేఖ, ములుగుకు సీతక్క కేటాయింపు

04

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జూన్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకల్లో భాగంగా 33 జిల్లాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించే ముఖ్య అతిథుల (మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల) వివరాలతో కూడిన అధికారిక జాబితాను ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరిగే ప్రధాన వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అంతకంటే ముందు ఆయన గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే అధికారిక వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ విప్‌లు కేటాయించిన జిల్లాల్లో జరిగే ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా వ్యవహరిస్తారు.

– అక్షరదర్బార్, హైదరాబాద్



## రూ.9 లక్షల లంచం డిమాండ్

- ఏసీబీ వలలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బతుల మహేందర్
- కేసులో ఇరికించకుండా ఉండేందుకు బేరసారాలు
- ఇప్పటికే రూ.5 లక్షలు వసూలు.. మిగతా రొక్కం కోసం వేధింపులు
- కార్యాలయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇంటి సోదాల్లో రూ.13 లక్షల నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభ్యం

03



# నాణ్యమైన విత్తనాలందించడమే లక్ష్యం

- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



అక్షరదర్బార్, హనుమకొండ: రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ఏఆర్ఎస్‌కే కేంద్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్టం రైతులు కల్తీ విత్తనాల భారిన పడి నష్టపోతున్న ఈ పరిస్థితుల్లో, రైతులను నాణ్యమైన విత్తనాల వినియోగం దిశగా నడిపించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు. ఈ రెండు జిల్లాల్లో ప్రధానంగా సాగు చేస్తున్న పంట వరి. రైతులకు ఆదాయం పెరగాలంటే, రైతులను వరి నుండి ఇతర పంటలైన పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వుల సాగు వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై, వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతుందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామని అన్నారు.

వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం ప్రస్తుత వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. సన్న రకాలైన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, దొడ్డు రకాలు కేఎన్ఎం 118, ఎమ్‌టీయూ 1010 విత్తనాలు నిల్వలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆదేశించారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందిస్తున్నామని చెప్పారు. సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాలు కేవలం రాయితీ ఉన్న పచ్చిరొట్ట విత్తనాలపైనే కాకుండా, ఇతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందించడంలో చొరవ చూపాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలని సూచించారు. ఈ రెండు జిల్లాల సాగు అంచనా ప్రకారం ఈ వానకాలం సీజన్ లో సుమారు 2.68 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 66 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో బి దేవేందర్ రావు, రెండు జిల్లాల డీఏఓలు, ఏడీఏలు, ఎంఏఓలు, సహకార శాఖ, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు

- టీక్యా తండాలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- రైతులను ముంచుతున్న మామ, అల్లుడు.. కేసు నమోదు
- రంగంలోకి దిగిన తొర్రూర్ పోలీసులు, సీసీఎస్ బృందం
- భారీగా నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం



అక్షరదర్బార్, తొర్రూర్: అమాయక రైతులను నిలువునా ముంచుతూ, నకిలీ విత్తనాలతో సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్ల గుట్టును పోలీసులు రట్టు చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం టీక్యా తండాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు సాగుతున్నాయన్న పక్కా సమాచారంతో తొర్రూర్ పోలీసులు, సీసీఎస్ బృందం సంయుక్తంగా శనివారం మెరుపు దాడి నిర్వహించి నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వానకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు నకిలీ విత్తనాల దందాకు తెరలేపారు. టీక్యా తండాలో పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాల అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీనిపై తక్షణమే స్పందించిన తొర్రూర్ రూరల్ పోలీసులు, సీసీఎస్ ప్రత్యేక బృందాలు సంయుక్తంగా సదరు స్థావరంపై దాడి చేసి నిందితులను పట్టుకున్నారు.

### మామ విక్రయం.. అల్లుడి సరఫరా!

పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ నకిలీ విత్తనాల దందా వెనుక 'మామ–అల్లుళ్ల' బంధం ఉన్నట్లు వెల్లడైంది. తండాకు చెందిన జాటోత్ వెంకన్న అనే వ్యక్తి



ఈ నకిలీ పత్తి విత్తనాలను స్థానిక రైతులకు విక్రయిస్తుండగా.. అతనికి అవసరమైన విత్తనాల స్టాక్‌ను అతని అల్లుడు బర్మావత్ సోమన్న సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ కలిసి గుట్టుచప్పుడు కాకుండా ఈ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు తేలింది.

### అమాయక రైతుల జీవితాలతో ఆటలు

లాభార్జనే ధ్యేయంగా నకిలీ విత్తనాలను అమ్ముతూ, నమ్మి వచ్చిన అమాయక రైతులను ముంచుతున్న ఈ ఇద్దరు నిందితులపై పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు పెట్టుబడి కోల్పోవడమే కాకుండా, పంట పండక అప్పులపాలయ్యే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు.

### కేసు నమోదు.. దర్యాప్తు తీవ్రతరం

రైతులను మోసం చేసి అక్రమంగా లాభాలు పొందుతున్న జాటోత్ వెంకన్న, బర్మావత్ సోమన్నలపై తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో చట్టరీత్యా కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ నకిలీ విత్తనాలను వీరు ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? దీని వెనుక ఇంకా ఎవరైనా పెద్ద తిమింగలాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.



## 2034 వరకు నేనే ఇక్కడ

- కేసీఆర్ పై ఒట్టు వేసి హరీష్ నిజం చెప్పాలి
- సీబీఐకి రెండు కేసులు ఇచ్చాం.. కిషన్ రెడ్డి ఎందుకు నోరు విప్పరు?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయని జోస్యం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీల అంతర్గత స్నేహాన్ని ఎండగడుతూనే, మాజీ మంత్రి హరీష్ రావు గురిచేసి విమర్శనాస్త్రాలు సంధించారు. రాబోయే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని జోస్యం చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు, సీబీఐ కేసులు, కాంగ్రెస్ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు పార్టీ మారుతున్నారనే ప్రచారంపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "హరీష్ రావు తెరవెనుక ఎవరెవరితో మాట్లాడుతున్నారో, ఏ ఏ శక్తులతో సంప్రదింపులు జరుపుతున్నారో పూర్తి సమాచారం నా దగ్గర ఉంది. ఆయనకు బీఆర్ఎస్ పార్టీపై అంత నిబద్ధత ఉంటే... తాను బీఆర్ఎస్ లోనే ఉంటానని కేసీఆర్ పై ఒట్టు వేసి చెప్పాలి. ఆ ధైర్యం హరీష్ రావుకు ఉందా?" అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

### బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయి

గత ఎన్నికల్లో తెరవెనుక సహకరించుకున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు... వచ్చే ఎన్నికల నాటికి బహిరంగంగానే జతకడతాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ అవినీతిపై తాము తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ బీజేపీని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలతో సహా రెండు కేసులను తమ ప్రభుత్వం సీబీఐకి అప్పగించిందని సీఎం వెల్లడించారు."మేము ఆధారాలతో కేసులను సీబీఐకి ఇస్తే, వాటిపై కేంద్రం ఎందుకు ముందడుగు వేయడం లేదు? దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి" అని సీఎం డిమాండ్ చేశారు.

### 2034 వరకు తెలంగాణలోనే

తన రాజకీయ భవిష్యత్తు, కాంగ్రెస్ పార్టీ వ్యూహాలపై సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్పష్టతనిచ్చారు. తాత్కాలిక రాజకీయాలు చేయడం తన నైజం కాదని, సుదీర్ఘ ప్రణాళికతో ఉన్నానని చెప్పారు."నేను జాతీయ రాజకీయాల్లోకి వెళ్తాననేది కేవలం ప్రచారం మాత్రమే. 2034 వరకు నేను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటాను. ఇక్కడి ప్రజలకు మేలు చేయాలన్నదే నా ఏకైక ఆలోచన" అని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తనది అత్యంత విజయవంతమైన కాంబినేషన్ అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయంతో తాము అద్భుతంగా పనిచేస్తున్నామని చెప్పారు. మా కాంబినేషన్ లో రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, 2029లో మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# నిజాయితీగా పని చేయాలి

- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రతి పోలీస్ అధికారి నీతి నిజాయితీగా పనిచేయాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన రాష్ట్ర పోలీస్ అధికారులతో శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులతో, ఉద్యోగ సమయం అధికారులు, సిబ్బంది పాటించాల్సిన తీరు పై డీజీపీ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశానికి వరంగల్ కమిషనరేట్ కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఎస్ఐలు వారి వారి కార్యాలయం నుంచి పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లిలో మిన్నంటిన 'మహిళా శక్తి సంబరాలు'

- స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ ప్రదర్శన, ర్యాలీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 31): 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' వారోత్సవాల్లో భాగంగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళల నుండి విశేష స్పందన లభించింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగి మండల సమాఖ్య కార్యాలయం వద్ద ముగిసింది. 'మహిళా సాధికారతే మన లక్ష్యం', 'వడ్డీ లేని రుణాలతోనే గ్రామాల్లో ప్రగతి' అంటూ చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని వందలాది మంది మహిళలు ఉత్సాహంగా నినాదాలు చేశారు.



# రూ.9 లక్షల లంచం డిమాండ్

- ఏసీబీ వలలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బతుల మహేందర్
- కేసులో ఇరికించకుండా ఉండేందుకు బేరసారాలు
- ఇప్పటికే రూ.5 లక్షలు వసూలు.. మిగతా రొక్కం కోసం వేధింపులు
- కార్యాలయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇంటి సోదాల్లో రూ.13 లక్షల నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభ్యం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో అవినీతి తిమింగలం గుట్టు రట్టయింది. సైబర్ నేరాలను అరికట్టాల్సిన అధికారే లంచాల పర్వానికి తెరలేపి, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బాధితుడి నుంచి రూ.9 లక్షల లంచం డిమాండ్ చేసిన కేసులో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బతుల మహేందర్‌ను ఏసీబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. ఏసీబీ విడుదల చేసిన అధికారిక ప్రెస్ నోట్ ప్రకారం.. హైదరాబాద్‌లోని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బతుల మహేందర్, ఒక సైబర్ మోసం కేసును దర్యాప్తు చేస్తున్నాడు. ఈ కేసులో ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులను, అతడి స్నేహితులను నిందితులుగా చేర్చకుండా ఉండేందుకు (అధికార అనుకూలత కోసం) ఇన్‌స్పె




క్టర్ మహేందర్ ఏకంగా రూ.9 లక్షల భారీ లంచాన్ని డిమాండ్ చేశాడు.

**కక్కుర్తి పడి.. కటకటాల్లోకి**

లంచం మొత్తంలో భాగంగా నిందితుడు మహేందర్ ఇప్పటికే ఫిర్యాదుదారుడి నుంచి రూ.5 లక్షల నగదును వసూలు చేశాడు. అయితే, మిగిలిన రూ.4 లక్షల కోసం బాధితుడిపై తీవ్రంగా ఒత్తిడి తెస్తూ, బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) అధికారులు పక్కా వ్యూహంతో శనివారం కార్యాలయంలోనే ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు.

**ఇంటి సోదాల్లో అక్రమ ఆస్తుల గుర్తింపు**

ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ అనంతరం ఏసీబీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే మహేందర్ నివాసంలో జరిపిన సోదాల్లో భారీగా అక్రమ ఆస్తులు వెలుగుచూశాయి. ఎలాంటి లెక్కలు లేని రూ.13 లక్షల నగదు, భారీగా బంగారు ఆభరణాలు, పలు ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతని అక్రమాస్తులపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అవినీతి కేసులో పట్టుబడిన ఇన్‌స్పెక్టర్ బతుల మహేందర్‌ను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం. ఈ అవినీతి నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరికైనా సంబంధం ఉందా అనే కోణంలో ఏసీబీ అధికారులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# రంగస్థలంపై 'రామాయణ' వైభవం

- పాత్రల్లో జీవించిన మొట్లపల్లి యువత!
- మూడు రోజులుగా కనువిందు చేస్తున్న పౌరాణిక నాటకం..
- నేడు పట్టాభిషేకంతో ముగింపు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 31): మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల పట్టాభిషేకం ఘట్టాన్ని స్థానిక కళాకారులు పౌరాణిక నాటకంగా ప్రదర్శిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ నాటక ప్రదర్శనకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర కళాబృందం ఆధ్వర్యంలో గురువారం ఈ నాటకం ప్రారంభమైంది. స్థానిక సర్పంచ్ నరహరి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి దీనిని ప్రారంభించారు. గ్రామానికి చెందిన యువకులే రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, రావణుడు వంటి పాత్రలను ధరించారు. మొదటి రోజు సీతా స్వయంవరం, రామ–సీత కల్యాణం, రెండో రోజు వనవాసం, లంకా దహనం, శనివారం రాత్రి రావణ వధ ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఆదివారం రాత్రి శ్రీ సీతారాముల పట్టాభిషేకం ఘట్టంతో నాటకాన్ని ముగించనున్నారు. పద్యాలు, సంభాషణలు, హావభావాలతో కళాకారులు పాత్రల్లో ఒదిగిపోయారు. టీవీ సీరియళ్లను తలపించేలా వేషధారణ, మేకప్, లైటింగ్ ఏర్పాటు చేయడంతో ప్రతిరోజూ 500 మందికి పైగా ప్రేక్షకులు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా



సర్పంచ్ నరహరి వెంకటరెడ్డి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా యువత నాటకాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి మాట్లాడుతూ స్థానిక కళాకారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. నాటకంలో రావణాసురుడిగా పాత్ర పోషించిన జన్నే తిరుపతి నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నేటి రాత్రి పట్టాభిషేకం అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



## ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు అవినీతిమయం

- కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం
- విజిలెన్స్ విచారణ కోరతా : చల్లా ధర్మారెడ్డి

అక్షరదర్బార్, పరకాల (మే 31): ప్రత్యేక అధికారుల పాలనలో పరకాల నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలు అవినీతికి నిలయాలుగా మారాయని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందే కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందనే బలమైన అనుమానాలు ఉన్నాయన్నారు. శనివారం పరకాల, నడికూడ మండలాల సర్పంచులు, ఉపసర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పనులు చేయకుండానే తప్పుడు బిల్లులు పొందడం, అక్రమ మొరం తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం, బతుకమ్మ ఏర్పాట్లు లేకుండానే నిధులు డ్రా చేయడం వంటి అక్రమాలు జరిగాయన్నారు.మిషన్ భగీరథ నీరు వస్తున్నా మోటార్లు కాలిపోయినట్లు తప్పుడు బిల్లులు సృష్టించారని, వీధిదీపాలు, ట్రాక్టర్ మరమ్మతుల పేరుతో నిధులు నొక్కేశారని ఆరోపించారు. ఎంబీ రికార్డులు లేకుండానే బిల్లులు చెల్లించి, ఇప్పుడు ఆ నిధులను 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సర్дуబాటు చేయాలని అధికారులు సర్పంచులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. పాలక పక్ష నేతల మెప్పు కోసం అధికారులు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వేధిస్తున్నారని మండిపడ్డారు. పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర, గీసుగొండ, సంగెం మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలన నాటి నుండి జరిగిన నిధుల వినియోగంపై విజిలెన్స్‌తో సమగ్ర విచారణ జరిపించాలని, దీనిపై హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

## లైన్‌మెన్ రాటిపెల్లి నర్సింగరావుకు ఘన వీడ్కోలు

అక్షరదర్బార్, పరకాల (మే 31): పరకాల పురపాలక సంఘం కార్యాలయంలో వాటర్ సప్లై లైన్‌మెన్‌గా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రాటిపెల్లి నర్సింగరావుకు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నర్సింగరావు తన సేవా కాలంలో పట్టణ ప్రజలకు, మున్సిపాలిటీకి ఎంతో అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. అనంతరం నర్సింగరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సి.హెచ్. రంజిత్, కౌన్సిలర్లు దుబాసి వెంకటస్వామి, గుడెల్లి సదన్ కుమార్, కుక్కల విజయ్‌కుమార్, బండి శ్రీధర్ పాల్గొన్నారు.




# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- జిల్లాల వారీగా ముఖ్య అతిథుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- అమరవీరులకు నివాళులు అర్పించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన అధికారిక కార్యక్రమం
- జిల్లాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్న మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, సలహాదారులు
- హనుమకొండకు పొంగులేటి, వరంగల్ కు సురేఖ, ములుగుకు సీతక్క కేటాయింపు




అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జూన్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకల్లో భాగంగా 33 జిల్లాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించే ముఖ్య అతిథుల (మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల) వివరాలతో కూడిన అధికారిక జాబితాను ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరిగే ప్రధాన వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అంతకంటే ముందు ఆయన గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే అధికారిక వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ విప్‌లు కేటాయించిన జిల్లాల్లో జరిగే ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా వ్యవహరిస్తారు.

### జిల్లాల వారీగా ముఖ్య అతిథుల వివరాలు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆయా జిల్లాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించే ప్రముఖులు హైదరాబాద్ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, ఖమ్మం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నల్గొండ ఆర్అండ్ బీ శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నారాయణపేట రాష్ట్ర మత్స్య, క్రీడల శాఖ మంత్రి శ్రీహరి, హనుమకొండ రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వరంగల్ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కరీంనగర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిద్దిపేట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భద్రాద్రి కొత్తగూడెం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మెదక్ రాష్ట్ర గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంగారెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహబూబాబాద్ ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ములుగు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ – సీతక్క, సూర్యాపేట పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వికారాబాద్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జనగామ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కామారెడ్డి ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు, భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి ప్రభుత్వ విప్ విజయ రమణారావు, రాజన్న సిరిసిల్ల విప్ ఆది శ్రీనివాస్, ఆదిలాబాద్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఆసిఫాబాద్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, నిర్మల్ విప్ వేముల వీరేశం, జగిత్యాల మంత్రి ఎండీ అజారుద్దీన్. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఆయా జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొంటారు.

### అమరవీరుల స్మరణ - సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లు

రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో టు వేడుకల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. జూన్ 2 ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండా ఆవిష్కరణ ముగిసిన తర్వాత, జిల్లా కేంద్రాల్లో ప్రధాన సభలు జరుగుతాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### పటిష్టమైన భద్రత, విస్తృత ఏర్పాట్లు

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేడుకలు జరిగే మైదానాల్లో వాటర్‌ప్రూఫ్ షామియానాలు, త్రాగునీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపులు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

## బాల్యానికి బంగారు బాట

**అంగన్‌వాడీల్లో 'విద్యారంభం' సర్టిఫికెట్లు**

**ఇటుకాలపల్లిలో చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ**



అక్షర దర్బార్, నర్సంపేట (మే 31): నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి సెంటర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" (బంగారు బాట) కార్యక్రమాన్ని సంబరంగా నిర్వహించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రీ-స్కూల్ పరిధిలోని 2.5 ఏళ్ల పిల్లల నూతన నమోదు ప్రక్రియను చేపట్టారు. అలాగే కేంద్రంలో 5 నుండి 6 ఏళ్లు పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు అధికారులు 'హెచ్‌బీవిద్యారంభం' సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సర్టిఫికెట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి చేరికకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఉచిత దుస్తులను పంపిణీ చేశారు. ఏసీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సమగ్రాభివృద్ధికి ఆటపాటలతో కూడిన అనువైన వాతావరణం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ, టీచర్ రమాదేవి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సమరం

- జూన్ 1నుండి 8 వరకు నిరసనలు జయప్రదం చేయండి
- మహమ్మద్ రాజా సాహెబ్



అక్షర దర్బార్, దుగ్గొండి (మే 31): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు దేశవ్యాప్తంగా చేపట్టే ప్రజా ఆందోళనలను విజయవంతం చేయాలని ఎంసీపీఐ (యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ పిలుపునిచ్చారు. శనివారం దుగ్గొండి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చండీగఢ్‌లో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశాల నిర్ణయం ప్రకారం ఈ నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి, విదేశీ సామ్రాజ్యవాదుల చేతుల్లో చిక్కుకొని దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించడం వల్లే దేశంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరుస్తూ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

# గీసుగొండలో అంతర జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- ఇద్దరు నిందితుల నుండి రూ. 35 వేల సొత్తు, బైక్ స్వాధీనం: సీఐ విశ్వేశ్వర్



అక్షర దర్బార్, గీసుగొండ (మే 31): గీసుగొండ మండల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర జిల్లాల దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 35,000 విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం కోనాయమాకుల ఎస్ఆర్ఎస్పీ కెనాల్ వద్ద ఎస్ఐ అనిల్ కుమార్ వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న కరీంనగర్ వడ్డెర కాలనీకి చెందిన సూర రవి (35), మహబూబాబాద్ సుక్కమ్మ బజార్‌కు చెందిన ఎం.డి. ఇమ్రాన్ (33)లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు రాంపూర్, ఎలుకుర్తి, శాయంపేట, గొర్రెకుంట ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు, ఇనుప సామగ్రి, బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుడు సూర రవిపై గతంలో 24 దొంగతనం కేసులు, ఇమ్రాన్‌పై 9 కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుండి స్ప్లెండర్ బైక్, 2 వ్యవసాయ మోటార్లు, రూ. 9,000 నగదు, వాల్వ్, 8 ఐరన్ పైపులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ అభినందించారు.

# భానుడి భగభగల్లో ఉపాధి కూలీలకు 'అరటి పండ్ల' ఊరట

- కూలీల బాగోగులను గాలికి వదిలేశారు
- పోరిక గోవింద్ నాయక్ ఆగ్రహం



అక్షర దర్బార్, ములుగు (మే 31): మల్లంపల్లి మండలం గుర్తురతండా గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు శనివారం బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పాలేపు శ్రీనివాస్ అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 46 డిగ్రీల రికార్డు స్థాయి ఎండలు, వడగాలులు వీస్తున్నా లెక్కచేయకుండా ప్రాణాలను పణంగా పెట్టి పనులకు వస్తున్న కూలీలకు ఎండదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు చెప్పాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూలీల కోసం పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, పనిముట్లకు పైసలు ఇచ్చేవారమని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూలీల బాగోగులను పూర్తిగా గాలికి వదిలేసిందని గోవింద్ నాయక్ మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీలకు నీడ, చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ వంటి కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గున్నాల యాకుబ్ రెడ్డి, గుగులోతు హరిలాల్ నాయక్, ఇస్లావత్ కొమ్మలు పాల్గొన్నారు.







# ముగింపు దశకు పుష్కరాలు

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అక్షరదర్బార్, కాళేశ్వరం: సరస్వతి అంత్య పుష్కరాలు ముగింపు దశకు వచ్చిన దరిమిలా రానున్న రెండు రోజులు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఎండల నుండి రక్షణ చర్యలు తదితర అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రద్దీ ఉండే ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాలు రద్దీ, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించుట, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతి రాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎండ దృష్ట్యా భక్తులు తెల్లవారు జాము నుండే త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించి స్వామి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



### అంతర్జాతీయ వేదికపై

# ఓరుగల్లు కీబోర్డ్ దరువు

- సుభాష్ చంద్రబోస్‌కు గిన్నిస్ గౌరవం
- 777 మంది విజేతల్లో ఒకరిగా నిలిచిన మొగుళ్లపల్లి ఎంపీఓ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 31): గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గిన్నిస్ 'అచీవర్స్ మీట్'లో మొగుళ్లపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) యు. సుభాష్ చంద్రబోస్ అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో ప్రపంచవ్యాప్తంగా 22 దేశాల నుండి సుమారు 2,000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొని, గంటపాటు విరామం లేకుండా కీబోర్డ్ వాయించి సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఈ పోటీలో అద్భుత ప్రతిభ కనబరిచిన 777 మంది ఉత్తమ వాయిద్యకారులను గిన్నిస్ ప్రతినిధులు ఎంపిక చేయగా, అందులో సుభాష్ చంద్రబోస్ ఒకరిగా నిలిచారు. అచీవర్స్ మీట్ సందర్భంగా మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండింగి.. సుభాష్ చంద్రబోస్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అచీవర్ సర్టిఫికేట్‌ను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. వృత్తిరీత్యా ప్రభుత్వ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, సంగీతంపై ఉన్న మక్కువతో అంతర్జాతీయ వేదికపై గిన్నిస్ రికార్డు సాధించడం పట్ల జిల్లా అధికారులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# సహకార వ్యవస్థపై కుట్రలు ఆపండి

- సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించిన సిరికొండ మధుసూదనాచారి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 31): రాష్ట్రంలోని సింగిల్ విండో సహకార సంఘాల చైర్మన్లను యథావిధిగా పదవుల్లో కొనసాగించాలని కోరుతూ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి శుక్రవారం రాజ్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట పలువురు సహకార సంఘాల చైర్మన్లు ఉన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా సహకార సంఘాల్లో ఎన్నికలు జరపకుండా తమకు అనుకూలంగా ఉన్న నామినేటెడ్ వ్యక్తులను నియమించాలని చూస్తోందని, ఇది సహకార సంఘాల చట్టానికి పూర్తిగా విరుద్ధమని ఆరోపించారు. 2020లో ఎన్నికైన చైర్మన్ల పదవీకాలం 2025 వరకు ఉందని, ఎలాంటి ముందస్తు చట్టవిరుద్ధ చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. ఈ అంశంపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందించి, చట్టప్రకారం న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని మధుసూదనాచారి వెల్లడించారు. ఎన్నికైన చైర్మన్ల హక్కులను కాపాడాలని సహకార సంఘాల ప్రతినిధులు కోరారు.

